సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు గడువు అక్టోబర్ 3

భీమునిపట్నం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని ఎంఈవో శివరాణి బుధవారం తెలిపారు. డిసెంబర్ 8న నిర్వహించనున్న పరీక్షకు అక్టోబర్ 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దీనికి అర్హులని తెలిపారు. కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ 3.50లక్షల ఆదాయంలోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. పరీక్షకు హాజరు కావాలనుకునే ఓసీ, బీసీ విద్యార్థులు పరీక్ష రుసుము కింద రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పరీక్ష సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inను సందర్శించాలని సూచించారు.

విద్యుత్ శాఖ ఏఈఈ శైలజ బాధ్యతల స్వీకరణ



మధురవాడ: మధురవాడ విద్యుత్ శాఖ ఏఈఈగా అల్లు శైలజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏఈఈ ఎస్‌వీఎస్ రామమూర్తి సిరిపురం బదిలీ కావడంతో, ఆయన స్థానంలో ఈమె బాధ్యతలు చేపట్టారు.

అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత దీన్‌దయాళ్



దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

తగరపువలస: అంత్యోదయ సిద్ధాంత స్ఫూర్తి ప్రదాత పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు అన్నారు. దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పి.వి.వి.ప్రసాదరావు, మీసాల రామునాయుడు, బోర శ్రీను, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీలతో శాస్త్రీయ దృక్పథం పెంపు



చెకుముకి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పద్మనాభం: చెకుముకి (శాస్త్రీయ విజ్ఞాన పరీక్ష) పోటీలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు అన్నారు. హైస్కూల్లో బుధవారం చెకుముకి పోటీలు నిర్వహించారు. పోటీల్లో 102 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు పిల్లల్లో అంతర్లీనంగా దాగి ఉన్న శాస్త్రీయ విజ్ఞానాన్ని వెలికి తీయడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, పి.వెంకటేశ్వరరావు, జి.సింహాచలం, కె.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సదుపాయాలు కల్పించాలి

తగరపువలస: రాష్ట్రంలోని ఆటో కార్మికులకు ఈఎస్ఐ, పనిభద్రత, బీమా వంటి సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయిందని సిటూ భీమిలి జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. చిట్టివలస సిటూ కార్యాలయం వద్ద నిర్వహించిన షిరిడీసాయి ఆటో కార్మిక సంఘం సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు సమగ్ర చట్టం చేయాలన్నారు. భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఆటో కార్మికులు ఎస్ఐను సన్మానించారు. ఆటో సంఘం గౌరవ అధ్యక్షుడు నీలాతి రాము, అధ్యక్షుడు పల్లా పెంటరాజు, ప్రధాన కార్యదర్శి పల్లా రమణ, ఉపాధ్యక్షుడు నమ్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● పాఠశాల ఘనం

మైదానం.. దయనీయం



ఇటీవల కురిసిన వర్షాలకు చెరువును తలపిస్తున్న చంద్రంపాలెం హైస్కూల్ మైదానం

రాష్ట్రంలోనే పెద్దదైన పాఠశాలగా గుర్తింపు.. 3380 మంది విద్యార్థులు.. 120 వరకు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది.. ఐదెకరాల సువిశాల ప్రాంగణం.. చంద్రంపాలెం హైస్కూల్ ఘనత ఇది.. కానీ పాఠశాల మైదానం పరిస్థితి మాత్రం దయనీయం. 4 ఎకరాల సువిశాల మైదానం ఉన్నా అంతా ఎత్తుపల్లాలు. చిన్న వర్షానికే చెరువులా మారడంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం.

- అధ్వానంగా చంద్రంపాలెం హైస్కూల్ గ్రౌండ్
- ఒక్కరోజు వాన పడినా పదిరోజులు ప్రార్థన బంద్
- ఇక డ్రిల్, క్రీడల సంగతి అంతే..
- రాకపోకలకు విద్యార్థుల అవస్థలు



చంద్రంపాలెం హైస్కూల్ గ్రౌండ్‌లో తేలిన రాళ్లు

మధురవాడ: మూడు అడుగులు ముందుకు.. ఆరు అడుగుల వెనక్కి అన్నట్టు ఉంది చంద్రంపాలెం హైస్కూల్ మైదానం అభివృద్ధి పరిస్థితి. చినుక పడితే చిత్తడిగా మారుతున్న ఈ మైదానం పాఠశాల ప్రత్యేకతను నీరు గార్చేస్తోంది. చిన్న పాటి వర్షం కురిసినా సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గ్రౌండ్ చెరువును తలపిస్తోంది. ఒక్క రోజు వర్షం కురిస్తే సుమారు 10 రోజుల పాటు విద్యార్థులకు మైదానంలో ప్రార్థనలు, ఎన్‌సీసీ డ్రిల్ వంటివి చేసుకునే అవకాశం ఉండదు. సరికదా పాఠశాలలోకి రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

ప్రతిభ ఉన్నా..

ఇక్కడి విద్యార్థులు ఏ క్రీడా పోటీలకు వెళ్లినా బహుమతి లేకుండా రారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఎందరో విద్యార్థులు రాణిస్తున్నారు. అయితే సరైన మైదానం, సదుపాయాలు లేకపోవడంతో పూర్తిస్థాయిలో శిక్షణ సాధ్యం కావడం లేదు.

రూ.లక్షలు వెచ్చించినా..

గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.5లక్షలు వెచ్చించి నీరు నిల్వ ఉండిపోయే చోట మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేశారు. కానీ, నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పరిస్థితిలో మార్పు లేదు. 2019కి ముందు కూడా రూ.15లక్షల వరకు నిధులు వెచ్చించి, పనులు చేశారు. అదే పరిస్థితి. ఇప్పుడు కూడా సరియైన ప్రణాళిక లేకుండా పనులు చేస్తుండడంతో పనుల్లో పురోగతి కానరావడం లేదు.



రాష్ట్రంలోనే పెద్దది అయిన చంద్రంపాలెం హైస్కూల్

ఇలా చేస్తే మేలు

మైదానంలోని వర్షం నీరు బయటికి తరలించే మార్గాలు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుంది. అయితే, పాఠశాలను ఆనుకునే భారీ కాల్వ ఉన్నా నీరు అందులోకి వెళ్లే మార్గం లేకపోవడం వల్లనే సమస్య వస్తోంది. అందువల్ల వర్షం నీరు కాల్వలోకి వెళ్లేవిధంగా ల్యాండ్ స్కేపింగ్ చేసి, అవసరం అయిన చోట పైపులైన్ వెయ్యాలి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బాస్కెట్‌బాల్ కోర్టు చెడిపోకుండా ఈ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మంత్రి హామీ ఇచ్చినా మమ అనిపించారు

గత నెల 30వ తేదీన ఈ పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సందర్శించి 10రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయన వెళ్లిన తర్వాత అధికార యంత్రాంగం సుమారు 20 లోడ్‌ల లారీలతో రాళ్లతో కూడిన గ్రావెల్ వేసి మమ అనిపించి వదిలేశారు. తర్వాత వర్షం రావడంతో పరిస్థితి మళ్లీ మామూలే.



బురదమయం అయిన గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి లోకేష్ (ఫైల్)

వర్షం వస్తే ప్రాక్టీస్ లేనట్లే..



మా స్కూల్లో పెద్ద ఆట స్థలం ఉంది. చాలా మంచి క్రీడాకారులు ఉన్నారు. కానీ, చిన్న వర్షం పడినా గ్రౌండ్ సరిగ్గా లేక ప్రాక్టీస్ చేయడం అవడంలేదు. దీంతో ఎంత పెద్ద ఆట స్థలం ఉన్నా, ప్రయోజనం లేకపోతుంది. ప్రాక్టీస్ సరిగ్గా లేకపోతే పోటీలకు ఎలా వెళ్లగలం? **–గనివాడ భాషిత, త్రైక్వాండో క్రీడాకారిణి**

వానొస్తే అడుగు వెయ్యలేం



చిన్న వర్షం పడినా గ్రౌండ్ బురదగా మారిపోవడంతో, అడుగు తీసి అడుగు వెయ్యలేం. నీరు బయటికి వెళ్లకపోవడంతో ఆ నీళ్లలోనే నడుస్తుంటే కాళ్లు దురదలు వచ్చేస్తున్నాయి. **–కోరాడ వంశీ, 10వ తరగతి విద్యార్థి**

6 నెలలు ఆటలకు అవకాశమే ఉండట్లేదు



మా చుట్టుపక్కల చాలా స్కూళ్లు ఉన్నా, ఇది మంచి స్కూల్ అని జాయిన్ అయ్యాను. ఆటలకు కూడా పెద్ద గ్రౌండ్ ఉందని ఆనందపడ్డాను. కాని కనీసం 6 నెలలు కూడా ఆటలు ఆడుకోవడానికి అవకాశం ఉండడం లేదు. గ్రౌండ్ అంతా ఎత్తు పల్లాలు. వర్షం వస్తే చెరువులా అయిపోతుంది. **– ఎం.రాకేష్, 10వ తరగతి విద్యార్థి**

వర్షా కాలం వస్తే ప్రార్థన ఉండదు



చిన్న వర్షం పడినా మా స్కూలు గ్రౌండ్ బురదగా ఉంటుంది. పెద్ద వర్షం వస్తే చెరువులా అయిపోతుంది. కనీసం ప్రార్థన చేసుకునే అవకాశం కూడా ఉండదు. మైదానం బాగుపడితే చాలా బాగుంటుంది. **–కన్నా మహేష్, 10వ తరగతి విద్యార్థి**

గ్రౌండ్ బాగైతే మా స్కూల్ సూపర్



మా పాఠశాలకు నిత్యం ఎంతోమంది నాయకులు, మంత్రులు పెద్దపెద్ద అధికారులు వస్తారు. గ్రౌండ్ బాగు చేస్తామని చెబుతారు. ఆ సమయంలో చాలా ఆనందంగా అనిపిస్తుంది. కానీ గ్రౌండ్ మాత్రం అలాగే ఉంటోంది. మైదానం బాగుపడితే మా పాఠశాల ఇంకా బాగుంటుంది. **–గర్నాపు నవీన్ కుమార్, 8వ తరగతి విద్యార్థి**

ప్రభుత్వ స్థలాలను సంరక్షించాలి



ప్రభుత్వ స్థల ఆక్రమణపై కౌన్సిల్‌లో చర్చిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: తిమ్మాపురంలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలను ఓ వ్యక్తి ఆక్రమించి వాటిని ప్లాట్స్‌గా విభజించి అమ్మేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు అన్నారు. బుధవారం జరిగిన జీవీఎంసీ కౌన్సిల్‌లో ఆయన భూఆక్రమణలపై చర్చించారు. బీచ్ రోడ్డు వెంబడి సర్వే నంబర్ 314 లో సుమారు 3వేల ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, కొంతమేర తొట్లకొండ బౌద్ధారామానికి సంబంధించినదని తెలిపారు. అయితే తిమ్మాపురంలో జరుగుతున్న ప్రభుత్వ స్థలాల అమ్మకాలపై తహసీల్దార్ కార్యాలయంలో, జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోకుంటే తీర ప్రాంత గ్రామస్తులంతా త్వరలో కలక్టరేట్‌ను ముట్టడిస్తామని పేర్కొన్నారు. అదే విధంగా 4వ వార్డులో పలు సమస్యలపై ప్రస్తావించారు.

ఆనందపురంలో జేసీ పర్యటన



గండిగుండంలో స్థానికులతో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

తగరపువలస: ఆనందపురం మండలంలోని శొంఠ్యాం, ఆనందపురం, గండిగుడం పంచాయతీలలో జేసీ మయూర్ అశోక్ బుధవారం పర్యటించారు. ఇటీవల పలు ఫిర్యాదుల మేరకు దర్యాప్తులో భాగంగా ఆయా పంచాయతీలలో రికార్డులు, భూములను పరిశీలించారు. ఆయనతో పాటు వీఎంఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు కీర్తి, లక్ష్మారెడ్డి, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, తహసీల్దార్ పి.శ్యామ్‌ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ తదితరులున్నారు.

సాగర్‌నగర్‌లో కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ కిరణ్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లోని హర్ష టవర్స్ వద్ద బుధవారం భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. ఈ టవర్స్ ప్లేగ్రౌండ్ వద్ద ఉన్న వలలో ఈ కొండచిలువ చిక్కుకుని పోయింది. దీనిని గమనించిన నివాసితులు వెంటనే స్నేక్ సేవర్ సొసైటీకి చెందిన కిరణ్ కుమార్‌కు సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న కిరణ్ కొండచిలువను జనాలు లేని చోట వదిలిపెట్టాడు. పాములు కనిపిస్తే ఎవరూ చంపవద్దని, తమకు సమాచారం అందించాలని తెలిపారు.

శ్రీ విద్యా శక్తిపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీతిన్‌పేటలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు భారతీయ సనాతన ధర్మ సంస్థానకు చెందిన శ్రీవిద్యా శక్తి పీఠంలో దేవీ శరన్నవరాత్రి యోగ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు సోమయాజుల కల్యాణచక్రవర్తి శర్మ తెలిపారు. ప్రతిరోజూ అర్చనలు, పంచామృతాలతో అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కుంకుమపూజలకు సంబంధించి పూజాసామగ్రి పీఠంలోనే ఇస్తారని తెలిపారు. 10న చండీహోమం, 12న శమీపూజ ఉంటాయని తెలియజేశారు. వివరాలకు 89783 73743, 83283 05636 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫార్మసిస్ట్‌ల సేవలు ఎనలేనివి

తగరపువలస: హెల్త్‌కేర్ డెలివరీలో ఫార్మసిస్ట్‌ల పాత్ర ఎనలేనిదని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంక్యుబేషన్ సెంటర్ కో–ఆర్డినేటర్ వై.రాజేంద్రప్రసాద్ తెలిపారు. అంతర్జాతీయ ఫార్మసిస్ట్‌ల దినోత్సవం సందర్భంగా చెరకుపల్లి అవంతి ఫార్మసీ కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య సవాళ్లు ఎదుర్కోవడంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర గురించి తెలియజేశారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యునితో సమానంగా ఫార్మసిస్ట్‌లు సేవలు అందిస్తున్నారన్నారు. సీఎంసీ లేబరేటరీ మేనేజింగ్ డైరెక్టర్ జగదీశ్వరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బి.వి. రాజు తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.



మాట్లాడుతున్న అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



అండర్-14 బాలుర కబడ్డీ పోటీలు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో మూడు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17 బాలురు, బాలికల ఆటలపోటీలు బుధవారంతో ముగిశాయి.

విజేతలు వీరే..

- వాలీబాల్ అండర్-17 బాలికల విభాగంలో ఏపీఆర్ఎస్, భీమిలి, గవర్నమెంట్ హైస్కూల్, భీమిలి బాలుర విభాగంలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్, భీమిలి నవజీవన్ మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. అండర్-14 బాలికల విభాగంలో కేథరిన్, భీమిలి, గవర్నమెంట్ హైస్కూల్ భీమిలి.. బాలుర విభాగంలో భీమిలి కేథరిన్, చిట్టివలస జెడ్పీ హైస్కూల్ జట్లు విజేతలుగా నిలిచాయి.
- కబడ్డీ అండర్-17 బాలికల విభాగంలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్, ఏపీఆర్ఎస్, భీమిలి..అండర్-14 బాలికల విభాగంలో జెడ్పీ హైస్కూల్ మంగమారిపేట, జెడ్పీ బాలికల హైస్కూల్, చిట్టివలస జట్లు మొదటి రెండు స్థానాలను గెలుచుకున్నాయి. అండర్-14 బాలుర విభాగంలో మజ్జివలస జెడ్పీహైస్కూల్, చిప్పాడ జెడ్పీ హైస్కూల్ జట్లు విజయం సొంతం చేసుకున్నాయి.
- ఖోఖో అండర్-17 బాలికల విభాగంలో ఏపీఆర్ఎస్, భీమిలి, జెడ్పీ బాలికల హైస్కూల్ చిట్టివలస.. బాలుర విభాగంలో భీమిలి ఎస్ఎస్‌సీబీపీ, చిట్టివలస జెడ్పీహైస్కూల్ విజేతలుగా నిలిచాయి. అండర్-14 బాలికల విభాగంలో ఏపీఆర్ఎస్, భీమిలి, జెడ్పీ బాలికల హైస్కూల్ చిట్టివలస, బాలుర విభాగంలో భీమిలి ఎస్ఎస్‌సీబీపీ, తాటితూరు జెడ్పీ హైస్కూల్ మొదటి రెండుస్థానాల్లో నిలిచాయి.
- చెస్ అండర్-17 బాలికల విభాగంలో ఎస్.పావని (ఏపీఆర్ఆస్-భీమిలి), ఎస్.మోహిత (ఎంజేపీఆర్ఎస్, భీమిలి), బాలుర విభాగంలో భీమిలి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి, అండర్-14 విభాగంలో ఎ.దేవయాని, ఎ.జ్యోత్స్న (చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్) బాలుర విభాగంలో తాళ్లవలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థి విజేతలుగా నిలిచారు.
- యోగా అండర్-17 బాలికల విభాగంలో సీహెచ్.నీహారిక (సన్ స్కూల్), ఆర్.తనూజ (సన్ స్కూల్), ఆర్.అనూష (ఎంజేపీఆర్ఎస్).. బాలుర విభాగంలో కె.రోహిత్, శివానంద్, వై.ఈశ్వర వర ప్రసాద్. అండర్-14 విభాగంలో ఎ.దేవయాని, ఎ.జ్యోత్స్న (చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్), బాలుర విభాగంలో పి.హర్ష, అవినాష్, కార్తీక్ విజయం సాధించారు.
- బాడ్మింటన్ అండర్-17 బాలికల విభాగంలో ఎంజేపీఆర్, భీమిలి, ఏపీఆర్ఎస్, భీమిలి.. అండర్-14 విభాగంలో ఏపీఆర్ఎస్, భీమిలి, నవజీవన్, భీమిలి జట్లు విజేతలుగా నిలిచాయి.

పద్మనాభం మండలంలో..

పద్మనాభం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. మంగళవారం కస్తూర్బా విద్యాలయంలో బాలికలకు ఆరు క్రీడల్లో నిర్వహించిన పోటీల్లో 270 మంది పాల్గొన్నారు. గోస్తని విద్యా పీఠంలో బుధవారం బాలురకు నిర్వహించిన క్రీడా పోటీల్లో 340 మంది పాల్గొన్నారు.

విరిగిన రిజర్వాయర్ చెక్‌నట్

తప్పిన ముప్పు ● తాగునీరు వృథా



గోస్తని నది వంతెన వరకు ప్రవహించిన రిజర్వాయర్ నీరు



చెక్‌నట్ విరిగిపోవడంతో పైపులైన్ నుంచి లీకవుతున్న తాగునీరు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు వెంకటేశ్వర మెట్టపై 18 లక్షల లీటర్ల సామర్థ్యం గల భగీరథ రిజర్వాయర్ చెక్‌నట్ బుధవారం విరిగిపోవడంతో, తాగునీరంతా వృథాగా పోయింది. గోస్తని నది నుంచి పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ సామియ్యవలస, భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలలో పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఈ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తారు. తరువాత ఈ రిజర్వాయర్ నుంచి తాగునీటిని నమ్మివానిపేట, భీమిలి పట్టణ ప్రజలకు పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తారు. రెండు రోజుల క్రితం రిజర్వాయర్‌ను ఆనుకుని పైప్‌లైన్‌లో చెక్‌నట్ పాడవటంతో సిబ్బంది మరమ్మతులు చేయిస్తున్నారు. పూర్తిగా బాగు చేయకుండానే మంగళవారం రాత్రి నీటిని పంప్ చేసి రిజర్వాయర్‌ను నింపేయడంతో, బుధవారం అకస్మాత్తుగా పైప్‌లైన్ నుంచి నీరంతా ఎగజిమ్మి కొండపై నుంచి నీరు జాతీయరహదారి సర్వీస్‌రోడ్డు మీదకు వరదలా పారింది. దీంతో స్థానికులు ఆందోళన చెంది కొండపై రిజర్వాయర్ బద్దలయిందేమోనని అనుమానం వ్యక్తం చేశారు.

జారిపడిన బండరాళ్లు

కొండపై రిజర్వాయర్ పైపులైన్ నుంచి నీరు ఫోర్స్‌గా రావడంతో ఆ ప్రవాహానికి సర్వీస్ రోడ్డుపై రెండు చోట్ల బండరాళ్లు, గ్రావెల్ జారిపడ్డాయి. అలాగే విజయదుర్గ పాత ఆలయం వెనుక కొండపై రాళ్లు జారిపడ్డాయి. శుక్రవారం రోజుల్లో అమ్మవారి ఆలయం రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో ఎక్కువ మంది భక్తులు తమ ద్విచక్రవాహనాలను సర్వీస్‌రోడ్డుపై మెట్లను ఆనుకుని పార్క్ చేస్తారు. బుధవారం కారణంగా భక్తుల తాకిడి లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. పైప్‌లైన్ నుంచి నీరు ఎగజిమ్మినచోట కంట్రోల్ చేయడానికి ప్రయత్నించిన నలుగురు సిబ్బంది ప్రవాహం ధాటికి తట్టుకోలేకపోయారు. ఈ సంఘటనతో నీరంతా సర్వీస్‌రోడ్డు మీదుగా ఇటు బాలాజీనగర్, అటు గోస్తని నది వంతెన వరకు చెరువులను తలపించాయి. రిజర్వాయర్‌లో నీటిని పంప్ చేయకుండా ఖాళీగా ఉన్న సమయంలో చేయవలసిన మరమ్మతులు నిండుగా ఉన్నప్పుడు చేయడంతో ప్రమాద తీవ్రత కనిపించింది. బుధవారం ఎలాగైనా చెక్‌నట్‌కు మరమ్మతులు నిర్వహిస్తామని తాగునీటి సరఫరా సిబ్బంది తెలిపారు.



వెంకటేశ్వరమెట్టపై 18 లక్షల లీటర్ల భగీరథ రిజర్వాయర్



విజయదుర్గ పాత ఆలయం వెనుక జారిన బండరాళ్లు

ప్రత్యేక అలంకరణలో సుత్తమ్మ తల్లి



భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లిని ఆలయ కమిటీ ప్రతినిధులు తులసిమాలలు, గజమాలతో అలంకరించారు. – తగరపువలస

మొక్కలు నాటిన అధికారులు



స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చంద్రంపాలెం హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు – మధురవాడ

వసతుల్లేవు.. టీసీలు ఇచ్చేయండి

ప్రిన్సిపాల్‌ను కోరిన పాడేరు విద్యార్థులు

తగరపువలస: మూడో కౌన్సెలింగ్ ద్వారా చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరిన విద్యార్థులు అక్కడ వసతులు లేకపోవడంతో తమకు టీసీలు ఇవ్వాలని ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావును కోరారు. ఉమ్మడి విశాఖ ఏజెన్సీలోని పాడేరు, సీలేరు, బాకూరు ప్రాంతాలకు చెందిన నలుగురు విద్యార్థులకు కౌన్సెలింగ్ ద్వారా చిట్టివలస డిగ్రీ కళాశాలలో సీట్లు వచ్చాయి. జాయిన్ అయిన తరువాత ఇక్కడికి వచ్చి చూస్తే తాగునీరు, టాయిలెట్లు, సరిపడా ఫర్నిచర్ లేకపోవడం, అధ్యాపకుల కొరత ఉండటంతో తాము ఇక్కడ చదువుకోమని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువచ్చారు. తగరపువలసలోని కళాశాల బాలుర వసతి గృహంలో కూడా ఖాళీలు లేకపోడంతో తామంతా తమ సొంత ప్రాంతాల్లోని కళాశాలలో చేరతామని చెప్పారు. దీంతో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కౌన్సెలింగ్ ద్వారా ఈ కళాశాలలో చేరినందున, ఇంకెక్కడా సీటు కేటాయించడం జరగదన్నారు. ఏదైనా కళాశాలలో సీటు వస్తే, అక్కడి యాజమాన్యంతో చెప్పిస్తే టీసీ ఇస్తామని చెప్పారు. బుధవారం చివరిరోజు కావడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలకు పూర్తిగా సొంత వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.5 కోట్లు ఇవ్వనుందన్నారు. అధ్యాపకులకు భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు తెలిపారు.



చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పాడేరుకు చెందిన విద్యార్థులు

తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు

తగరపువలస: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం తాటితూరు, మజ్జివలస ఆనందపురం మండలం బోని, చందక పంచాయతీలలో వ్యవసాయాధికారులు వరిలో తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు. భీమిలి మండలంలో రైతు శిక్షణ కేంద్రం డీఆర్సీ ఏడీఏ చదువుల సుబ్రహ్మణ్యం, ఆనందపురం మండలంలో ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆశాదేవి, భీమిలి ఏడీ విజయప్రసాద్ రైతులకు సూచనలిచ్చారు. జిల్లా ఉద్యానవనశాఖాధికారి కె.సత్యనారాయణరెడ్డి, ఏవోలు బి.శివకోమలి, చావా సంధ్యారత్నప్రభ, అధికారులు వనజ, శ్రీనివాస చక్రవర్తి, పశు సంవర్ధకశాఖ వైద్యుడు కాంతికిరణ్ పలు అంశాలను వివరించారు. వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పద్మనాభం: రెడ్డిపల్లి, పొట్నూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పశు వైద్యాధికారి లక్ష్మణరావు, ఏవో ఎంవీఎస్ చలం సూచనలు చేశారు. వైస్ ఎంపీపీ రాజేశ్వరి, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ ఆదినారాయణ మార్కెటింగ్ అధికారి మేరి కుమారి, ఉద్యానవన శాఖాధికారి స్వాతి పాల్గొన్నారు.